సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 6 । మార్చి । 2023



అతివేగమే.. మృత్యు పాశమై..


అతివేగం ఆ యువకులను అనంత లోకాలకు తీసుకెళ్లింది.. పుట్టినరోజు వేడుకలు జరుపుకొని వేగంగా వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. - 8లో



రూ.1.11 లక్షల విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మండవ సాయిగణేష్, సాయిరూపేష్ (ఎన్టీఆర్ జిల్లా ఎనికేపాడు) ఆదివారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7,550 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,370, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

లక్ష్మీనారసింహునికి వేదాశీర్వచనం

కోరుకొండలో ఘనంగా పండిత సదస్యం



సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు

మధురపూడి: కల్యాణమూర్తులుగా కొలువుదీరిన కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి పండితులు వేదాశీర్వచనం చేశారు. వారి వేదమంత్ర ఘోష గ్రామంలో ప్రతిధ్వనించింది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం ఆలయంలో పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం ఆలయం తలుపులు తెరిచి సుప్రభాత సేవ అనంతరం స్వామివారి దర్శనాలకు అనుమతించారు. అనంతరం గ్రామ బలిహరణ, 9 గంటలకు సేవాకాలం, తీర్థ, ప్రసాద గోష్ఠి శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణ మండపంలో వేద పండితుల సమక్షంలో సదస్యం నిర్వహించారు.

ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానానికి చెందిన నలుగురు వేద పండితులను ఘనంగా సత్కరించారు. రాత్రి 9 గంటలకు ఆంజనేయ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం నుంచి రెడ్డి పంతులు సత్రం, పాత సంత మార్కెట్, సాయిబాబా గుడి, అంకాలమ్మ దేవాలయం, శివాలయం మీదుగా గ్రామోత్సవం తిరిగి ఆలయానికి చేరుకుంది. కల్యాణోత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కోరుకొండ కిటకిటలాడింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన సాయంత్రం బూర్లు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఎస్వీ రంగరాజ భట్టర్, ఎస్వీ నృసింహస్వామిరాజు భట్టర్, అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యులు తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలలో 22న ఉగాది వేడుకలు



శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ద్వారకా తిరుమల: చిన వెంకన్న దివ్యక్షేత్రంలో ఈ నెల 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారి ప్రధానాలయంతో పాటు, ఉత్సవం జరిగే ఉగాది మండపాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయం నుంచి ఉభయ దేవేరులతో కలసి స్వామివారు వెండి శేషవాహనంపై ఉగాది మండపం వద్దకు ఊరేగింపుగా తరలివెళతారని తెలిపారు. అక్కడ పంచాంగ శ్రవణం అనంతరం పండిత సత్కారం జరుగుతుందన్నారు. అనంతరం శ్రీవారి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తామని తెలిపారు.

జీడిమామిడి, జామాయిల్ తోటలు దగ్ధం



ప్రమాదంలో కాలిపోతున్న జామాయిల్ తోట

తాళ్లపూడి: తాడిపూడి పంచాయతీ బయ్యవరం కొండ ప్రాంతంలో ఆదివారం పలు తోటలు ముఖ్యంగా జీడిమామిడి, జామాయిల్ తోటలు దగ్ధమయ్యాయి. సుమారు 25 ఎకరాల వరకూ నష్టం వాటిల్లినట్టు సమాచారం. మంటలను ఆర్పడానికి రైతులు తీవ్రంగా శ్రమించారు. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది ఎండీ బేగ్, కేవీ రెడ్డి తదితరులు ఫైరింజన్ సాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే చాలా వరకూ తోటలు కాలిపోయాయని రైతులు వాపోతున్నారు. రాగోలపల్లికి చెందిన రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. తహసీల్దార్ టి.రాధిక, ఆర్ఐ క్రాంతిరేఖ, వీఆర్ఓ లీలావతి, సర్పంచ్ నామా గోపాలం తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకుంటున్నారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

ఆగుతూ.. సాగుతూ..



అసంపూర్తిగా మిగిలిన 4, 5 ప్లాట్‌ఫాంలు



అరకొరగా ఫుట్ వే బ్రిడ్జి

- రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నత్తనడకన ప్లాట్‌ఫాంల నిర్మాణం
- ఐదేళ్లయినా కొలిక్కిరాని పనులు
- అవుటర్‌లో ఆలస్యమవుతున్న రైళ్లు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో రాజమహేంద్రవరం ప్రధానమైన రైల్వే స్టేషన్. విజయవాడ తరువాత అతి పెద్ద స్టేషన్ ఇది. నిత్యం రద్దీగా ఉంటుంది. వందలాదిగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అన్ని ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లతో పాటు కోల్‌కతా – చెన్నై మార్గంలో అనేక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ తప్పనిసరిగా ఆగుతాయి. తూర్పు గోదావరితో పాటు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తమ రైలు ప్రయాణాలకు ఈ స్టేషన్ పైనే ఆధారపడుతుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ స్టేషన్ అభివృద్ధిలో జరుగుతున్న జాప్యం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. ముఖ్యంగా అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అవుటర్‌లో ఆగిపోతూ..

రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ సుమారు 30 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ తదితర రైళ్లు 140 వరకూ ఈ స్టేషన్ మీదుగా నడుస్తున్నాయి. వీటితో పాటు మరో వంద వరకూ గూడ్స్ రైళ్లు కూడా నడుస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం మూడు ప్లాట్‌ఫాంలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై, విశాఖపట్నం, కాకినాడ వైపు వెళ్లేవి 3వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగుతూంటాయి. అత్యవసర సమయాల్లో 2వ నంబర్ ప్లాట్‌ఫాం ఉపయోగిస్తారు. ఉన్న ఈ మూడు ప్లాట్‌ఫాంలు వందలాదిగా నడుస్తున్న రైళ్లకు చాలడం లేదు. దీంతో పలు సందర్భాల్లో సిగ్నల్ పడక.. రైళ్లను అవుటర్‌లో నిలిపేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన స్టేషన్ సమీపానికి వచ్చేసి కూడా, అవుటర్‌లో అధిక సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కోసారి 10 లేదా 15 నిమిషాల నుంచి అరగంట వరకూ నిరీక్షించాల్సి వస్తోంది. దీనిపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

2019లో ప్రారంభం

రైళ్ల రద్దీని, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో 4, 5 ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టారు. వీటికి 2018లో టెండర్లు ఖరారయ్యాయి. సుమారు 10 మీటర్ల వెడల్పు, 610 మీటర్ల పొడవున నిర్మించాలని నిర్ణయించారు. ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా రైల్వే యార్డు ఆధునీకరణ పనుల కారణంగా ప్లాట్‌ఫాంల నిర్మాణం ఏడాది పాటు ప్రారంభం కాలేదు. 2019లో ప్రారంభించినా కోవిడ్ ఉధృతి కారణంగా పనులు పడకేశాయి. ఎట్టకేలకు 2021 ఆగస్టులో మళ్లీ పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్‌కు సంబంధించిన కాంక్రీట్ పనులు చేపట్టారు. అయితే బిల్లులు మంజూరు కాకపోవడంతో అదే ఏడాది నవంబర్‌లో పనులు నిలిపివేశారు. 2022 జనవరి నుంచి మళ్లీ పనులు కొనసాగించారు. గత డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలనుకున్నప్పటికీ పనులు పూర్తి కాలేదు. ప్లాట్‌ఫాంలు ఒక రూపు సంతరించుకున్నప్పటికీ చివరి దశగా చేపట్టాల్సిన రేకు షెల్టర్లు, వెయిటింగ్, కంట్రోల్ రూములు, సిగ్నల్స్, ఫుట్ వే బ్రిడ్జి నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. ఈ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తారని చెబుతున్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారుల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు.

17 నుంచి గో సమ్మేళనం

ద్వారకా తిరుమల: ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ ద్వారకా తిరుమల మార్కెట్ యార్డులో గో సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి కోరారు. మార్కెట్ యార్డులో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఒంగోలు, పుంగనూరు జాతి ఆవులు, గిత్తల అందాల పోటీలు, ఒంగోలు ఆవుల పాల పోటీలు నిర్వహించ తలపెట్టామన్నారు. ఒంగోలు, పుంగనూరు ఆవులు, గిత్తలను వివిధ కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. పోటీలు జరిగే మూడు రోజులూ గో ఆధారిత వ్యవసాయంపై నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను గుర్తించి ఘనంగా సత్కరిస్తామని చక్రపాణి తెలిపారు.

ఇకపై అందరికీ ఒకేలా ప్రసాదం

- వీఐపీలైనా, సామాన్య భక్తులైనా ఒకటే..
- ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశం
- రత్నగిరిపై రెండో రోజూ తనిఖీలు

అన్నవరం: 'సామాన్య భక్తులకు, వీఐపీలకు ఇకపై ఒకే రకమైన గోధుమ నూక ప్రసాదాలు ఇవ్వాలి. వీఐపీలకు స్పెషల్‌గా తయారు చేసిన ప్రసాదం ఇవ్వడానికి వీలు లేదు. భక్తులకు ఇచ్చేదే స్పెషల్‌గా తయారు చేయండి' అంటూ సిబ్బందిని అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. వరుసగా రెండో రోజైన ఆదివారం కూడా ఆయన రత్నగిరిపై తనిఖీలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాలు తయారు చేసే భూతాది విభాగంలో ఆరు గంటల పాటు కూర్చుని, భక్తులకు, వీఐపీలకు ఇచ్చే ప్రసాదాల తయారీని పరిశీలించారు. వీఐపీలకు ఇచ్చే ప్రసాదంలో నెయ్యి, గోధుమ నూక, పంచదార అధికంగా వాడడంతో పాటు ఎక్కువసేపు ఉడికిస్తున్నారని గుర్తించారు. ఇకపై దిట్టం పెంచకుండా సామాన్య భక్తులకు ఇచ్చే ప్రసాదం కూడా వీఐపీ ప్రసాదంలా ఉండాలని ఆదేశించారు. గతంలో ఈఓలు ఏ పని చెప్పినా అంచనాలు, కమిషనర్ అనుమతి అంటూ కాలయాపన చేసే దేవస్థానం ఇంజినీరింగ్ సిబ్బంది ఒక్క పూటలోనే ఈఓ కార్యాలయంలో కిటికీలు తొలగించి గోడ నిర్మించారు. వాస్తు కోసం పడమటి వైపు కిటికీలు తొలగించి, గోడ నిర్మించాలని, ఆదివారం నాటికి అది పూర్తి కావాలని ఇన్‌చార్జి ఈఓ శనివారం మధ్యాహ్నం ఆదేశించారు. ఆదివారం ఉదయానికల్లా ఆ పని పూర్తి కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అలాగే మెయిన్ క్యాంటీన్ ఎదుట వాడేసిన విద్యుత్ పరికరాల గుట్టలను తొలగించాలని ఇన్‌చార్జి ఈఓ శనివారం ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నానికల్లా వాటిని ట్రాక్టర్లపై కొండ దిగువన గోశాల వద్దకు తరలించారు.



పాడైన విద్యుత్ పరికరాలను ట్రాక్టర్లపై తరలిస్తున్న సిబ్బంది

ఇన్‌చార్జి ఈఓ తెల్లవారుజామున మూడు గంటలకు కొండ మీద సప్త గోకులం, దాని పక్కనే ఉన్న వాటర్ ట్యాంకర్లను పరిశీలించారు. ట్యాంకర్ల నుంచి నీరు లీకవుతుండటం గమనించి వాటర్ వర్క్స్ అధికారులను అప్రమత్తం చేశారు. కేశఖండన శాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. అక్కడి శానిటరీ విభాగంలోని ఉద్యోగిని ఈఓను సాధారణ భక్తుడనుకుని డబ్బులు అడిగింది. ఆమెపై అజాద్ ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే కిందకు పంపించేశారు. ఆ తరువాత కొండ దిగువన గోశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పూర్తిగా బంగారు కవచాలతో కాకుండా తొలుత పట్టువస్త్రాలు, ఆ తరువాత బంగారు ఆభరణాలతో అలంకరించాలని అర్చకులను ఆదేశించారు. ఇందుకు భక్తులు సమర్పించిన పట్టువస్త్రాలను వాడాలని సూచించారు.

ప్రసాదాల పంపిణీ పెంపు

సాక్షి ఇంపాక్ట్

శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో భక్తులకు తీర్థప్రసాదాలను పర్వదినాల్లో కూడా మధ్యాహ్నం 2 గంటల వరకూ పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. సాధారణ రోజుల్లో 25 కేజీల పులిహోర, చక్కెర పొంగలి తయారు చేస్తుండగా.. పర్వదినాల్లో దీనిని 35 కేజీలు తయారు చేసేలా దిట్టం (ప్రసాద తయారీ దినుసులు) పెంచారు. సాధారణ రోజుల కన్నా పర్వదినాల్లో స్వామివారి ఆలయానికి భక్తులు అధికంగా వస్తారు. ఆ రోజుల్లో కూడా 25 కేజీల ప్రసాదాలు మాత్రమే తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తున్నారు. దీంతో మధ్యాహ్నానికే ప్రసాదాలు అయిపోయి, భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'అరకొరగా ప్రసాదాల పంపిణీ' శీర్షికన 'సాక్షి' శనివారం వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు పర్వదినాల్లో ప్రసాదాల పరిమాణాన్ని పెంచాలని ఆదేశించారు. ఆదివారం స్వామివారి ప్రసాదాలను మధ్యాహ్నం 2 గంటల వరకూ పంపిణీ చేశారు.



ఆదివారం మధ్యాహ్నం కూడా చక్కెర పొంగలి పంపిణీ చేస్తున్న అర్చకులు

మహిళా ఆరోగ్యంతోనే కుటుంబ సౌభాగ్యం

- మహిళా దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ
- ప్రారంభించిన కలెక్టర్ మాధవీలత



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహిళలు ఆరోగ్యం ఉంటేనే ఆ కుటుంబం సౌభాగ్యంగా ఉటుందని కలెక్టర్ కె.మాధవవీలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన మారథాన్ సైకిల్ ర్యాలీని ఆమె ఆదివారం ప్రారంభించారు. ర్యాలీలో వైద్యాధికారులు, నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దైనందిన జీవితంలో భాగంగా మహిళలు తప్పనిసరిగా సైక్లింగ్ చేయాలన్నారు. ఇది ఏరోబిక్ వ్యాయామమని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో తోడ్పడుతుందని చెప్పారు. సైకిల్ తొక్కడం వల్ల రక్తనాళాలు, ఊపిరితిత్తులు బాగా పని చేస్తాయన్నారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సైక్లింగ్ సహాయపడుతుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినన్ని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కానింగ్ సెంటర్లపై సోమవారం డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తామని, ఇందుకోసం 22 మందితో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గురుప్రసాద్, డీఎస్ఎంఓ డాక్టర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తజన వాహిని

అన్నవరం: రత్నగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ సుమారు 30 వేల మంది సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 2 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ఉపాధికి ఊతం

- మత్స్య సంపద విక్రయాలకు ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లు
- దుకాణాలు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు రుణాలు
- భారీగా సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం

కొవ్వూరు: ప్రస్తుతం రాష్ట్రంలో చేపలు, రొయ్యల వంటి వాటి తలసరి వినియోగం ఏడాదికి 8 కిలోలు ఉంది. దీనిని 25 నుంచి 30 కిలోలకు పెంచే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందుకోసం 'ఫిష్ ఆంధ్ర' అవుట్‌లెట్లు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల వంటి వాటిని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాయి. వీటి ద్వారా నిరుద్యోగ యువత పరిశుభ్రమైన, నాణ్యమైన లైవ్ చేపలు, రొయ్యలు, పీతలు, ఇతర సీఫుడ్స్‌ను సరసమైన ధరలకే విక్రయించుకుని, ఉపాధి పొందేందుకు బాటలు వేస్తున్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద వివిధ యూనిట్లు ఏర్పాటు చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల మహిళలకు రుణాల్లో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్రం 60 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తున్నాయి. జిల్లాలో ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ అవుట్‌లెట్లు, లైవ్ ఫిష్ అమ్మే దుకాణాలు, ఫిష్ ఆంధ్రా లాంజ్, ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్ల ఏర్పాటుకు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్ల కొనుగోలుకు ఈ సబ్సిడీ రుణాలు అందిస్తున్నారు. పెరవలిలో రూ.కోటితో ఫిష్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఫిష్ అవుట్‌లెట్లకు చేపలు, రొయ్యల వంటి వాటిని సరఫరా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 2,500 ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. ఏడాదికి 7 వేల మెట్రిక్ టన్నుల రొయ్యలు, 3,500 మెట్రిక్ టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి.

రూ.50 లక్షల వరకూ సబ్సిడీ రుణాలు

- ఫిష్ అవుట్‌లెట్లు, ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్ల ఏర్పాటుకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ రుణాలు ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు 60 శాతం, బీసీలు, ఇతరులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుంది.
- డైలీ మోడల్ ఫార్మాట్ యూనిట్‌కు రూ.10 లక్షల రుణం ఇస్తారు. ఇందులో తాజా చేపలతో పాటు రొయ్యలు, చేపలతో తయారు చేసే వివిధ రకాల స్నాక్స్ అమ్ముతారు. డైలీ షీ ఫిష్ మోడల్‌లో కూడా రూ.10 లక్షలు మంజూరు చేస్తారు. ఇందులో అన్ని రకాల స్నాక్స్, పచ్చళ్లు విక్రయిస్తారు.
- రెస్టారెంట్ల ఏర్పాటుకు రూ.20 లక్షల వరకూ రుణం ఇస్తారు. 30 మంది కూర్చునేలా ఏర్పాటు చేస్తారు. ఇక్కడ అన్ని రకాల బిర్యానీలతో పాటు, స్నాక్స్, ఫుడ్ ఐటెమ్స్ విక్రయిస్తారు. వీటిని భవనం లేదా కంటైనర్‌లో ఏర్పాటు చేసుకోవచ్చు.
- లాంజ్ మోడల్‌లో రెస్టారెంటు ఏర్పాటుకు రూ.50 లక్షల వరకూ రుణం అందిస్తారు. ఇందులో ఒకేసారి ఐదారు రకాల 25 కిలోల ఫుడ్ ఐటెమ్స్ తయారు చేసేందుకు అవసరమైన వివిధ రకాల ఎల్రక్టికల్ ఓవెన్స్ ఉంటాయి. ఇక్కడ టిఫిన్లు కూడా అందుబాటులో ఉంటాయి. జిల్లాలో రూ.50 లక్షల లాంజ్ మోడల్‌వి రెండు, రూ.20 లక్షల యూనిట్లు రెండు, రూ.10 లక్షల యూనిట్లు 9 చొప్పున ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రూ.50 లక్షల లాంజ్ మోడల్ రెస్టారెంట్ రాజమహేంద్రవరంలో రూపుదిద్దుకుంటోంది. రెండు రూ.20 లక్షల యూనిట్లకు లబ్ధిదారుల గుర్తింపు కూడా పూర్తయింది. రూ.10 లక్షల యూనిట్ ఒకటి నిర్మాణంలో ఉంది. మరో రెండు యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. రూ.10 లక్షల యూనిట్‌కు 10 శాతం, రూ.50 లక్షలు, రూ.20 లక్షల యూనిట్లకు 15 శాతం చొప్పున లబ్ధిదారు వాటా చెల్లించాలి. ఈ మొత్తం చెల్లిస్తే సబ్సిడీ మంజూరు చేస్తారు. మిగిలిన సొమ్మును బ్యాంకు రుణంగా లేదా సొంతంగా సమకూర్చుకోవాలి. ఈ యూనిట్ల ఏర్పాటు ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

109 అవుట్‌లెట్ల మంజూరు

లైవ్ ఫిష్ విక్రయాలకు జిల్లా వ్యాప్తంగా 109 అవుట్‌లెట్లు మంజూరు చేశారు. ఇప్పటికే 20 యూనిట్లు ప్రారంభించారు. మరో 10 యూనిట్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ రుణం ఇస్తారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళకు 60 శాతం, బీసీ, ఇతరులకు 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. తాజా లైవ్ ఫిష్, ఎండు చేపలు, ఐస్ ఫ్రెస్ ఫిష్, ఎండు రొయ్యలు, పీతలు, సముద్రపు చేపలు విక్రయిస్తారు.



లాంజ్ మోడల్‌లో ఫిష్ ఆంధ్రా రెస్టారెంట్

- చేపల విక్రయానికి రూ.75 వేల విలువైన టీవీఎస్ మోపెడ్, ఐస్ బాక్సులు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 19 మందికి వీటిని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, బీసీలు, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.
- చేపలు అమ్మకానికి అనువుగా ఉండే ఆటోలను రూ.4.20 లక్షల నుంచి రూ.4.50 లక్షలతో అందిస్తున్నారు. జిల్లాకు 19 ఆటోలు మంజూరయ్యాయి. ఇప్పటికే ఒకరికి అందజేశారు. మరో ఐదుగురిని ఎంపిక చేశారు. ఈ ఆటోల్లో చేపల విక్రయానికి పనికి వచ్చే బాక్సులు, ఐస్ బాక్సులు, వెయింగ్ మెషీన్, డస్ట్‌బిన్ వంటివి ఏర్పాటు చేస్తారు. ఈ యూనిట్‌కు ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు గరిష్ఠంగా రూ.1.80 లక్షలు, బీసీలు, ఇతరులకు రూ.1.20 లక్షల చొప్పున సబ్సిడీ ఇస్తారు.
- చేపలు, చేప పిల్లల రవాణాకు నాలుగు లేదా ఆరు చక్రాల వ్యాన్ల కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు గరిష్ఠంగా రూ.12 లక్షలు, బీసీలు, ఇతరులకు రూ.8 లక్షల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. వ్యాన్‌తో పాటు 10 ఆక్సిజన్ సిలిండర్లు, 10 డ్రమ్ములు, పైపులు అందిస్తారు. ఐషర్ వ్యాన్‌కు రూ.24.40 లక్షలు, టాటా వ్యాన్‌కు రూ.21.20 లక్షల చొప్పున రుణం ఇస్తారు.

నెలాఖరుకు లక్ష్య సాధన



లక్ష్యాల మేరకు ఈ నెలఖరుకు దుకాణాలు ఏర్పాటు చేస్తాం. ఆసక్తి ఉన్న వారు ఆయా గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఈ–మత్స్యకార యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– వి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖాధికారి

క్లుప్తంగా

హత్యకు గురైంది ఆ మహిళేనా..?

● కేసును ఛేదించే పనిలో పోలీసులు

రాయవరం: మండలంలోని మాచవరం- పసలపూడి గ్రామాల మధ్య మండపేట- కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని గత నెల 24న జరిగిన హత్య కేసు మిస్టరీని ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది.ఆ రోజు పూర్తిగా కాలిన స్థితిలో మృతదేహం లభ్యమైన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటన జరిగి పది రోజులు అయినప్పటికీ హంతకులెవరనేదీ తేలలేదు. హత్య జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న కాలనీకి చెందిన మహిళే హతురాలుగా పోలీసులు భావిస్తున్నారు. కాలనీకి చెందిన మహిళ హత్య జరిగిన రోజు నుంచి అదృశ్యమవడంతో ఆమే అయి ఉండొచ్చనే కోణంలో పోలీసులు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు. ఆ మహిళే హతురాలైతే.. ఎవరు హత్య చేసి ఉంటారు? హత్యకు గల కారణం ఏమై ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. హత్య జరిగిన రోజు అదృశ్యమైన మహిళ ఎక్కడెక్కడ తిరిగిందన్న విషయంపై పోలీసులు దృష్టి సారించి, గ్రామంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనా ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ హత్య కేసును ఛేదించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామని మండపేట రూరల్ సీఐ శివగణేష్ వెల్లడించారు. రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి నేతృత్వంలో దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తామని అన్నారు.

గోదావరిలోకి దిగి గల్లంతు

ఆత్రేయపురం: పది మంది స్నేహితులు సరదాగా క్రికెట్ ఆడేందుకు పొట్టిలంక గౌతమీ గోదావరి పాయ వద్ద వద్దిపర్రు గోదావరి ఒడ్డుకు వెళ్లారు. అందులో ఒక యువకుడు స్నానం చేసేందుకు గోదావరిలోకి దిగి గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గోదావరి ఒడ్డున పీరవరానికి చెందిన యువకులు క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లారు. సరదాగా కాసేపు ఆడుకున్న తరువాత ఆ యువకుల్లో సమ్మింగి శివ (24) గోదావరిలో స్నానానికి వెళ్లాడు. అక్కడ నీటి ఉధృతి ఎక్కువగా ఉండటం.. పైగా లోతుగా ఉండటంతో మునిగిపోయాడు. దీంతో తోటి స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు స్పందించి నీట మునిగిన యువకుడిని రక్షించేందుకు యత్నించారు. కానీ ఆ యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై సమాచారం తెలుసుకున్న ఎస్సై సీహెచ్ సుధాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. యువకుడి తండ్రి సూరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సీతానగరం: బొబ్బిల్లంక అశోక్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ ఆదివారం తెలిపారు. తన పదమూడేళ్ల కుమార్తెను అదే గ్రామానికి చెందిన గుమ్మల ఏసు ప్రేమించానంటూ మోసం చేశాడని, అలాగే సోడదాసి సీతారామరాజు కూడా మోసగించాడని ఆ మహిళ ఫిర్యాదు చేసింది. దీనిపై పోక్సో కేసు నమోదు చేశారు. దీనిని నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తారని ఎస్సై వివరించారు.

శ్రీరస్తు.. ఉచిత విద్యా ప్రాప్తిరస్తు

- పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య
- ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు
- విద్యా హక్కు చట్టం పక్కాగా అమలు
- ఈ ఏడాది 570 మందికి అవకాశం



రాయవరం: చదువుకు అంతరాల్లేవ్.. అడ్డుగోడలు అంతకన్నా ఉండకూడదనే ప్రభుత్వ ఆలోచన కార్యరూపంలోకి వచ్చింది.. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను పక్కాగా అమలు చేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022-23 విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 570 మందిని ఎంపిక చేశారు. వారంతా ఆయా మండలాల్లోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందారు. తొలుత అధికారులు స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్లు, నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించారు. ఎంపికైన జాబితాను రాష్ట్ర విద్యాశాఖ డీఈఓల ద్వారా ఆయా పాఠశాలలకు పంపించారు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేశారు.

ఇప్పటి నుంచే కార్యాచరణ

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ అంశాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో అర్హులు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ప్రస్తుతం నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఐబీ/ఐసీఎస్‌ఈ/సీబీఎస్‌ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న పాఠశాలల్లో ఈ సీట్లు కేటాయించాల్సి ఉంది. ఆ పాఠశాలలు ఈ నెల ఆరవ తేదీ నుంచి సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాలని కమిషనర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

షెడ్యూల్ ఇలా..

మార్చి 6 నుంచి 16 వరకు: సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్
మార్చి 18 నుంచి ఏప్రిల్ 4 వరకు: విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
ఏప్రిల్ 9 నుంచి 12 వరకు: విద్యార్థుల అర్హత నిర్ధారణ
ఏప్రిల్ 13: లాటరీ ద్వారా మొదటి విడత జాబితా విడుదల
ఏప్రిల్ 15 నుంచి 21 వరకు: ఆయా పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు
ఏప్రిల్ 25: లాటరీ ద్వారా రెండో విడత జాబితా విడుదల
ఏప్రిల్ 26 నుంచి 30 వరకు: ఆయా పాఠశాలల్లో రెండో విడత విద్యార్థుల చేరికలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు

తూర్పుగోదావరి	146
కోనసీమ జిల్లా	194
కాకినాడ జిల్లా	230
మొత్తం	570

పేదలకు వరం



అందరికీ విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. విద్యా హక్కు చట్టం మేరకు పేదలకు ఒకటో తరగతిలో ప్రైవేట్ స్కూళ్లలో ప్రవేశానికి అవకాశం కల్పించింది. ఇది వారికి వరం లాంటిది. ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులతో తల్లిదండ్రులు దరఖాస్తు చేయించాలి.
– జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

మంచి నిర్ణయం



ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఆర్‌టీఈ చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశానికి చర్యలు తీసుకోవాలని ఎంఈఓలకు ఆదేశాలు ఇస్తున్నాం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలు చేసిన మాదిరిగానే వచ్చే ఏడాదీ అమలుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం చర్యలు చేపట్టడం మంచి నిర్ణయం.
– ఎం.కమలకుమారి, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఎంతో ప్రయోజనకరం



విద్యా హక్కు చట్టాన్ని ఆయా పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనల అమలుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ప్రభుతం కల్పించిన ఈ అవకాశం పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. పేద విద్యార్థులకు సీట్లు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం.
– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పుగోదావరి జిల్లా

క్రీడాకారులు ఉన్నతంగా రాణించాలి

● సినీ నటుడు సంపూర్ణేష్ బాబు



బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం సిటీ): రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్ ఆర్‌పీఎల్ సీజన్-5 క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉన్నతంగా రాణించాలని సినీ నటుడు, హీరో సంపూర్ణేష్ బాబు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆదివారం ఆయన వచ్చారు. మాస్టర్ బ్లాస్టర్, వైజాగ్ క్రికెట్ పాంథర్స్ జట్లను సంపూర్ణేష్ బాబు కలుసుకున్నారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐపీఎల్ స్థాయిలో ఆర్‌పీఎల్ నిర్వహించడం రాజమహేంద్రవరం నగరానికే గర్వకారణమన్నారు. ఇటువంటి టోర్నమెంట్లో తనను భాగస్వాములను చేసిన నిర్వాహకులు అజరపు వాసు, కుంచే శేఖర్‌లకు అభినందనలు తెలిపారు. 20 రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో 8 రాష్ట్రాల జట్లు పాల్గొంటున్నాయని, వీరంతా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. నగర ప్రముఖులు బీవీఎస్ రెడ్డి, ఎల్ఐసీ యూనియన్ నాయకులు సమ్మతం గన్నయ్య, విజ్జిన మధు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతూ.. విక్రయిస్తూ..



అమలాపురంలో అరెస్టు చేసిన యువకులను చూపిస్తున్న ఎస్సై హరీష్‌కుమార్

● రెండు చోట్ల 13 మంది అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన ఏడుగురు యువకులు గంజాయి తాగుస్తూ.. విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరు చింతపల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి రహస్యంగా కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. స్థానిక సావరం బైపాస్ రోడ్డు దగ్గరలో ఈ యువకులు గంజాయిని సమానంగా పంచుకుని అమ్ముకునే నిమిత్తం ఉండగా పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్ వారి కదిలికలపై అనుమానం వచ్చి ఆరా తీశారు. దీంతో త్రిపురారి సాయి, సూర్యతేజ, దూలం వీరేంద్రకుమార్, గోకరకొండ కొండబాబు, వాసంశెట్టి ప్రసాద్, బెహర కళ్యాణ్, కముజు నరసింహలను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 21 కిలోల గంజాయి, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టయిన వారంతా 24 ఏళ్ల లోపు వయసు వారే.

అన్నంపల్లి అక్విడెక్ట్ వద్ద..

ముమ్మిడివరం: గంజాయి తాగుతూ చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్న ఆరుగురిని ముమ్మిడివరం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నర్సీపట్నం వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి అన్నంపల్లి గ్రామ అక్విడెక్ట్ వద్ద సమానంగా పంచుకుని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముమ్మిడివరం పరిసర ప్రాంతాలకు చెందిన నక్కా మధు, మాకే అబ్బులు, కొండేపూడి సిద్ధార్థ కుమార్, మోకా చంటి, మోకా శ్రీనివాసరావు, పెనుమాల విజయ్‌కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 23 కిలోల గంజాయిని, నాలుగు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు.

వరుపుల రాజాకు కడసారి వీడ్కోలు







ప్రత్తిపాడులో వరుపుల రాజా పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజాను కడసారి చూసేందుకు అశేష సంఖ్యలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కాకినాడ ఆసుపత్రిలో శనివారం రాత్రి గుండెపోటుతో వరుపుల రాజా మృతి చెందిన సంగతి తెలిసిందే. రాజా పార్థివ దేహాన్ని శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రత్తిపాడులోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. ప్రజల సందర్శనార్థం సాయంత్రం వరకూ ఆ గ్రామంలోనే ఉంచారు. నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ప్రత్తిపాడులో వ్యాపార వర్గాలు సంతాప సూచకంగా స్వచ్ఛంద బంద్ పాటించాయి. వరుపుల రాజా పార్థివ దేహం వద్ద రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీతా, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్, పెండెం దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, టీడీపీ ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, జ్యోతుల నెహ్రూ, పిల్లి అనంతలక్ష్మి, బండారు సత్యానందరావు, వర్మ, సత్యంశెట్టి వెంకటేశ్వరరావు, వనమాడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, గిడ్డి ఈశ్వరి, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ తదితరులు నివాళులర్పించారు.



వరుపుల రాజా కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎంపీ వంగా గీత

వ్యక్తి ఆత్మహత్య

కాకినాడరూరల్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఇంద్రపాలెం ఎస్సై నాగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొవ్వాడ గ్రామానికి చెందిన ఊటా వంశీకృష్ణ (33) తన ఇంట్లో శనివారం అర్ధరాత్రి ఉరివేసుకున్నారు. సుమారు 15 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతను అప్పటి నుంచి మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఏడాది కిందట హనుమాన్ జంక్షన్‌కు చెందిన మహిళతో వివాహం అయ్యింది. పెళ్లయిన తర్వాత నుంచి అత్తవారి ఇంటి వద్ద ఉంటున్నాడు. అక్కడ భార్యతో మాటమాట పెరిగి శనివారం కొవ్వాడ వచ్చారు. రాత్రి 12 గంటల తర్వాత ఉరివేసుకుని ఉంటాడని భావిస్తున్నట్లు మృతుని తల్లి మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెలుగుభాషకు మధునాపంతుల సేవలు ఎనలేనివి



మధునాపంతుల శతజయంతి మహోత్సవాల్లో రామశాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కాజులూరు: తెలుగు భాష అభివృద్ధికి మహాకవి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి చేసిన సేవలు ఎనలేనివని ప్రఖ్యాత కథకుడు, రచయిత, ఆర్‌బీఐ రిటైర్డ్ లీగల్ అడ్వైజర్ ఏఎస్ రామశాస్త్రి (అనామకుడు) అన్నారు. ఆదివారం పల్లిపాలెంలోని ఆంధ్రీకుటీరంలో మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 108వ శతజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంధ్రీకుటీరం నిర్వాహకులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సాహిత్యం, కళలకు ప్రజాదరణ తగ్గిపోతున్న తరుణంలో మహాకవి మధునాపంతుల కాజులూరు మండలం పల్లిపాలెంలో ఎనిమిది దశాబ్దాల క్రితం ఆంధ్రీ కుటీరం పేరుతో ఒక సంస్థను స్థాపించి ప్రాచీన కావ్య సంపద, తెలుగు, సాంస్కృతిక భాషలకు జీవం పోశారన్నారు. సమాజానికి తమ వంతు భాషా సేవ చేయాలనే లక్ష్యంతో 1939లో ఆంధ్రీ కుటీరం పేరుతో ఒక సాహిత్య మాసపత్రికను స్థాపించి దాని ద్వారా పలువురి కవుల భాషా, సాహిత్యాలను వెలుగులోకి తీసుకువచ్చి వారిని ప్రశంసించారన్నారు. ఆంధ్రీకుటీరం, ఆంధ్రీ పత్రిక ద్వారా మధునాపంతుల కుటుంబీకులు నాలుగు తరాలవారు నేటికి ఎందరో కవులు, రచయితలకు సన్మానాలు, సత్కారాలు చేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. తెలుగు భాష అభివృద్ధికి మహాకవి మధునాపంతుల చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.

అనంతరం కిరణ్ మధునాపంతుల ఆధ్వర్యాన మధుశ్రీలు కథా గౌరవ సభ నిర్వహించి ప్రముఖ రచయిత ఏఎస్ రామశాస్త్రి (అనామకుడు), ప్రముఖ కథకుడు దాట్ల దేవానందరాజు, ప్రముఖ కవి, కాలమిస్ట్ ముక్కామల చక్రధర్ తదితరులను ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవులు అవధానుల మణిబాబు, అద్దేపల్లి ప్రభు, ఖమ్మంకు చెందిన సీతారాం సన్మానగ్రహీతల రచనలపై విశ్లేషణ ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో ఎంవీ చలపతి, మధునాపంతుల వెంకటేశ్వర్లు, బాలాంత్రపు వెంకటరమణ, డేనియేల్‌నెజర్స్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగమే.. మృత్యు పాశమై..

- పుట్టిన రోజు వేడుక జరుపుకొని వస్తుండగా ప్రమాదం
- సిగ్నల్ బోర్డును ఢీకొని ఇద్దరి దుర్మరణం
- అపస్మారక స్థితిలో మరో యువకుడు



పెద్దాపురం: అతివేగం ఆ యువకులను అనంత లోకాలకు తీసుకెళ్లింది.. పుట్టినరోజు వేడుకలు జరుపుకొని ఆ స్నేహితులంతా కలసి వేగంగా వస్తుండగా జరిగిన ప్రమాదం మృత్యువై వెంటాడింది.. రాత్రి వేళ పార్టీ అనంతరం ఎవరూ ఉండరని రోడ్డుపై అనుకున్నారో ఏమో అతివేగంగా బైక్‌ను నడిపి అదుపుతప్పి ఆర్అండ్‌బీ సిగ్నల్ బోర్డును బలంగా ఢీకొన్నారు. పక్కనే ఉన్న ఏలేరు కాలువ ఒడ్డున పడి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలి- పులిమేరు గ్రామాల మధ్య చోటుచేసుకుంది. మరో యువకుడు తీవ్ర గాయాలపాలై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం పులిమేరు గ్రామానికి చెందిన బొజ్జపు సత్యవరప్రసాద్ (22) జన్మదినం. ఈ సందర్భంగా తన స్నేహితులు పులిమేరుకు చెందిన గుత్తుర్తి వీరవరప్రసాద్ (22), ఉలిమేశ్వరానికి చెందిన సాయిలతో కలసి జన్మదిన వేడుకలను జరుపుకొనేందుకు దివిలి వెళ్లారు. అక్కడ సరదాగా గడిపిన ఆ ముగ్గురూ తిరిగి ఇంటికి అర్ధరాత్రి 1.30 గంటలకు బైక్‌పై బయలు దేరారు. అతివేగంగా వస్తున్న వారి బైక్ మార్గం మధ్యలో సామిల్లు వద్ద అదుపు తప్పి ఆర్ అండ్‌బీ సిగ్నల్ బోర్డును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంతో బొజ్జపు సత్యవరప్రసాద్, గుత్తుర్తి వీరవరప్రసాద్ పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న ఏలేరు కాలువ ఒడ్డున పడి మృతి చెందారు. గాయాలపాలైన సాయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఆదివారం వేకువజామున 3.30 గంటలకు సాయికి మెలకువ వచ్చి బంధువులు, పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ సురేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఉదయం 5.30 సమయంలో మృతదేహాలను కనుగొన్నారు. వాటిని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు సాయిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టిన రోజు నాడే..



బొజ్జపు సత్యవరప్రసాద్ (ఫైల్)

పుట్టినరోజు నాడే బొజ్జపు సత్యవరప్రసాద్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. ఇతనికి తల్లి బొజ్జపు వాణి, తమ్ముడు ఉన్నారు. తండ్రి కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. దీంతో సామర్లకోట మండలం మేడపాడులోని అమ్మమ్మ ఇంటికి వెళ్లి వీరంతా ఉంటున్నారు. శనివారం పుట్టినరోజు కావడంతో గతంలో నివాసం ఉన్న పులిమేరుకు వెళ్లి స్నేహితులతో కలసి కేక్ కోశాడు. సత్యవరప్రసాద్ ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ సిమ్‌లు విక్రయిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు.



గుత్తుర్తి వీరవరప్రసాద్ (ఫైల్)

● మరో యువకుడు గుత్తుర్తి వీరవరప్రసాద్‌కు తండ్రి గంగా మహేష్, తల్లి లోవకుమారి, తమ్ముడు ఉన్నారు. వీరవరప్రసాద్ ఓ ప్రైవేట్ మొబైల్ కంపెనీలో ఫోన్ సిమ్‌లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. తండ్రి చిన్న వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడనే సమయంలో ప్రమాదం జరిగి ఇలా మృత్యువాత పడడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.